క్లుప్తంగా

మోస్తరు వర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇక సాయంత్రం నుంచే ఆకాశంలో మేఘాలు కమ్ముకుని చల్లని వాతావరణం ఏర్పడింది. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమితో ఉక్కపోతకు గురైన నగర ప్రజలు.. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో కుంకుమార్చన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని మాతా రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి సోమవారం పూజారి రమణయ్య ఆధ్వర్యంలో కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు హెచ్‌ఎం మారేపల్లి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలకు వేసవి సెలవులు ఉన్నప్పటికీ మొక్కల సంరక్షణ దృష్ట్యా తరచూ నీరు పట్టేందుకు వస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు గ్రామానికి చెందిన కొందరు విద్యార్థులు, ఉపాధ్యాయుడు తాహెర్ సైతం మొక్కలకు నీరు పట్టేందుకు శ్రద్ధ చూపుతున్నట్లు పేర్కొన్నారు.

సమాజ సేవలోనే ఆత్మసంతృప్తి



అడ్డాకుల: నిరుపేదలకు సేవ చేయడంలోనే ఆత్మసంతృప్తి ఉంటుందని రిటైర్డ్ ఆర్డీఓ హన్మంత్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం జానంపేటకు చెందిన ఆయన.. పౌర్ణమిని పురస్కరించుకొని చక్రాపూర్ స్టేజీ వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులతో జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు, స్థానికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హన్మంత్‌రెడ్డి సతీమణి రజిత పాల్గొన్నారు.

'గ్రామీణ హర్తాల్‌లో పాల్గొనాలి'

జడ్చర్ల టౌన్: దేశవ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టిన గ్రామీణ హర్తాల్‌లో ఉపాధి హామీ, వ్యవసాయ కూలీలు, కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ పిలుపునిచ్చారు. సోమవారం లింగంపేట గ్రామపంచాయతీ ఇన్‌చార్జి శివకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మెలో కార్మిక, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి యాదయ్య, రంగయ్య, ఆంజనేయులు, శ్యామల, సువర్ణ, చెన్నమ్మ పాల్గొన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్న మహ్మద్ జాకీర్ అన్సారీని సోమవారం ఆలిండియా సున్ని ఉల్‌మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహిసిన్‌పాషా ఖాద్రీ సన్మానించారు. మక్కా, మదీనా షరీఫ్‌లో జిల్లా ప్రజల క్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్ మతీన్ అన్సారీ, అబ్దుల్ నయీమ్ అన్సారీ, షకీల్ మొహియొద్దీన్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయల్దేరిన ఓ వ్యక్తి జడ్చర్ల పట్టణంలో కనిపించకుండా పోయాడు. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. మహ్మదాబాద్ మండలం చౌదర్‌పల్లికి చెందిన ఇసరి రాముడు (38) బతుకుదెరువు నిమిత్తం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. అయితే గత మార్చి 17న తన భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు ఇసరి రాముడును గమనించి.. హైదరాబాద్ నుంచి క్యాబ్‌లో జడ్చర్లకు పంపించాడు. అయితే జడ్చర్లలో కారు దిగిన రాముడు.. ఇప్పటి వరకు ఇంటికి చేరలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆ చూకీ లభించలేదు. అతడి తమ్ముడు యాదయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

- ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్
- ఘనంగా బుద్ధపూర్ణిమ వేడుకలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/స్టేషన్ మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ రూరల్/జడ్చర్ల టౌన్/హన్వాడ: గౌతమ బుద్ధుడు బోధించిన పంచశీల బోధనలు అనుసరణీయమని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. సోమవారం బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో బుద్ధపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడి విగ్రహం ఎదుట ముడా చైర్మన్ ప్రగతి శీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. వైశాఖ పౌర్ణమినాడే సిద్ధార్థ జననం, బుద్ధుడిగా జ్ఞానోదయం జరిగిందన్నారు. మూఢ నమ్మకాలకు తావు లేకుండా శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధంగా ఆలోచించినప్పుడే జీవన మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మహామాయ బుద్ధ విహార్ అధ్యక్షుడు ఆదిలక్ష్మయ్య, బీఎస్‌ఐ నిర్వాహకులు గడ్డమీది గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు రామలింగం, బుర్ర సురేశ్, కోశాధికారి అశోక్‌కుమార్, వెంకట్రాములు, జీవరత్నం, అరుణ్‌కుమార్, దినేశ్ ఎర్ర నరసింహ, కుర్మయ్య, లక్ష్మణ్, జ్యోతి పాలమూరు విద్యార్థి జేఏసీ బత్తిని రాము, ప్రజా సంఘాల ఐక్యవేదిక కోకన్వీనర్ శ్రీనివాస్ యాదవ్, పులిజాల రవికిరణ్, యాదవ మహాసభ తాలూకా అధ్యక్షుడు గొండ్యాల రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.



బుద్ధపూర్ణిమ వేడుకల్లో పాల్గొన్న ముడా చైర్మన్ లక్ష్మన్ యాదవ్, ప్రజా సంఘాల నాయకులు

■ గౌతమ బుద్ధుని జయంతిని పురస్కరించుకొని జ్ఞాన నీలి మెరుపు బహుజన మహనీయుల శోభాయాత్ర కమిటీ నాయకులు చేపట్టిన భీమ్ దీక్షలను గుల్బర్గాలోని సిద్ధార్థ బుద్ధ విహార్‌లో విరమించినట్లు కమిటీ జిల్లా అధ్యక్షుడు పాతూర్ రమేష్ తెలిపారు. బౌద్ధ బిక్షుల ద్వారా దీక్ష విరమణ చేయడం జరిగిందని పేర్కొన్నారు. నెలరోజుల పాటు దీక్ష చేపట్టిన వారు అంబేడ్కర్ ఆలోచనలు, బౌద్ధయిజంపై గ్రామగ్రామానా విస్తృతంగా ప్రచారం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా కోఆర్డినేటర్ సింగిరెడ్డి పరమేశ్వర్, యాదగిరి, నరేందర్, నర్సింహులు, కిష్టప్ప, ఉపాధ్యాయుడు చెన్నయ్య పాల్గొన్నారు.

■ జడ్చర్ల పట్టణంలోని బొటానికల్ గార్డెన్‌లో బుద్ధుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య, వార్డు కౌన్సిలర్ సతీష్ బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమెన్స్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, సభ్యులు గోపాల్‌గౌడ్, రాధాకృష్ణ, పరిశోధక విద్యార్థిని రమాదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భరత్, నందు పాల్గొన్నారు.

■ హన్వాడ మండలంలోని బుద్ధారంలో బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ మండల అధ్యక్షుడు బాలకిష్టయ్య, మాజీ సర్పంచులు చెన్నయ్య, వెంకన్న, నాయకులు నాగన్న, జంబులయ్య, రఘురాంగౌడ్, అనంతరెడ్డి, నాగయ్య, గంగాపురి పాల్గొన్నారు.



జడ్చర్ల బొటానికల్ గార్డెన్‌లో..



హన్వాడ మండలం బుద్ధారం గ్రామంలో..

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూస్తాం



కొల్లూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్

నవాబుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, లారీలు అందుబాటులో ఉండేలా చూస్తామని జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కొల్లూర్, లింగంపల్లి, కాకర్లపహాడ్, నవాబుపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి 14వేల గన్నీబాగ్యులు సరఫరా చేశామని.. ప్రతి కేంద్రంలో 5వేల బస్తాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రైతుల నుంచి ధాన్యం త్వరగా కొనుగోలు చేసి.. మిల్లులకు తరలించే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన రైతుల వివరాలను వెనువెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కమనీయం.. వీరభద్రుడి కల్యాణం



వీరభద్రస్వామి, కాళీమాత కల్యాణం జరిపిస్తున్న పండితులు

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి గ్రామ సమీపంలో వెలసిన వీరభద్ర, కాళీమాత ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం భద్రానంద స్వామి ఆధ్వర్యంలో వీరభద్ర, కాళీమాత కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి.. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేడుకను కనులపండువగా జరిపించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తజనం స్వామివారి కల్యాణ వేడుకను కనులారా తిలకించి భక్తిపారవశ్యంతో ఉప్పొంగారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు భాస్కర్‌గౌడ్, తిరుపతిగౌడ్, దాసు స్వామి, మల్లేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు : డీఏఓ



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేశ్

కోయిల్‌కొండ: ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాల స్టాక్ తదితర రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. డీఏఓ వెంట ఏఓ వేమారెడ్డి ఉన్నారు.

హైవేపై పైప్‌లైన్ లీకేజీలు



న్యూటౌన్ చౌరస్తాలోని అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద రోడ్డుపై పారుతున్న తాగునీరు

- ఏరులై పారుతున్న మిషన్ భగీరథ తాగునీరు
- పాదచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు



అశోక్ టాకీస్ చౌరస్తాలోని బాలగంగాధర్‌తిలక్ విగ్రహం వద్ద ఇలా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఎన్‌హెచ్-167పై మూడు చోట్ల మిషన్ భగీరథ పథకం పైపులైన్ దెబ్బతింది. దీంతో తాగునీరు వృథాగా ఏరులై పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సుమారు వారం రోజుల క్రితం స్థానిక అశోక్ టాకీస్ చౌరస్తాలోని బాలగంగాధర్‌తిలక్ విగ్రహం సమీపంలో రెండు చోట్ల ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. అలాగే న్యూటౌన్ చౌరస్తాలోని అబ్దుల్ కలాం విగ్రహం వద్ద సుమారు ఎనిమిది నెలల క్రితం పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. తాగునీరు సరఫరా చేసినప్పుడల్లా రోడ్డుపై వృథాగా పారుతోంది. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎంఈ సందీప్ వరల్డ్‌ను వివరణ కోరగా.. ఆయా చోట్ల పైపులైన్‌కు వెంటనే మరమ్మతు చేయిస్తామన్నారు. ప్రధాన రహదారిపై పైప్‌లైన్ లీకేజీ కాకుండా చూస్తామన్నారు.

ఘనంగా అన్నమాచార్యుడి జయంతి



జడ్చర్ల టౌన్: పట్టణంలోని అక్షరకాన్సెప్ట్ స్కూల్‌లో సోమవారం సంస్కారభారతి ఆధ్వర్యంలో అన్న మాచార్యుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి, జ్యోతిప్రజ్వలన చేశారు. తెలుగు తీయదనానికి, భక్తి పరిమళానికి మణితోరణం, పదకవితా పితామహుడు అన్నమాచార్య అని కొనియాడారు. సంస్కార భారతి సభ్యుడు రాధాకృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ రేణుక పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



రాజాపూర్: మండలంలోని రాయపల్లిలో సోమవారం గ్రామదేవత (బొడ్రాయి) బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, బోనాల ఊరేగింపులో శివసత్తుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



జడ్చర్ల టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్ అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో సోమవారం గంగాపురంలో స్నేహ కంపెనీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జడ్చర్ల ఇన్‌చార్జి కాల్వ రాంరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కైలాస్ జవహర్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దేవరకద్ర: భూముల రిజిస్ట్రేషన్ విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. భూముల రిజిస్ట్రేషన్ కోసం నేరుగా మీసేవ ద్వారా భూ భారతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సొంతంగా లాగిన్ అయి స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయానికి వచ్చినా రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మీసేవ కేంద్రాల్లోనూ ప్రభుత్వం నిర్ణయించిన రుసుము మాత్రమే చెల్లించాలని తెలిపారు.

'బడిబాట'లో భాగస్వాములు కావాలి



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల టౌన్: ప్రతి శుక్రవారం నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఫిజియోథెరిఫి విధానాన్ని పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు త్వరగా కోలుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో మహిళా సంఘాలు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేసి.. బాలబాలికలు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. అదే విధంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించి వారి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తిగా ఇంటివద్దే ఉండే వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. డీఈఓ వెంట ఎంఈఓ మంజులాదేవి, సీఎంఓ బాలుయాదవ్, ఐఈఆర్పీ విజయ, సునీత ఉన్నారు.

భూ భారతి సదస్సులను వినియోగించుకోండి



దాసర్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

అడ్డాకుల: భూ భారతి చట్టం అమలు కోసం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మూసాపేట మండలంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజు నాయక్ కోరారు. మండలంలోని తిమ్మాపూర్, దాసర్‌పల్లి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. భూ సమస్యలపై దాసర్‌పల్లిలో 53, తిమ్మాపూర్‌లో 24 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులే గ్రామాలకు వస్తున్నారని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై అందించే దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాగా, మంగళవారం సంకలమద్ది గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ నెల 7న మూసాపేటలో దరఖాస్తులు అందించిన వారు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మదన్మోహన్‌గౌడ్, నాగలక్ష్మి, నాజ్యానాయక్, డీటీలు వరప్రసాద్, చంద్రశేఖర్, మాధవి, ఆర్ఐలు బాలసుబ్రహ్మణ్యం, సృజన్, అరుణ్, రవికుమార్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాంనాయక్

నవాబుపేట: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య మరింత పెంచాలని ఎంపీడీఓ జయరాం నాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో పనులు కావాలని అడిగే ప్రతి ఒక్కరికీ పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి దరఖాస్తుల పరిశీలనను పూర్తిచేసి.. తుది జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. వనమహోత్సవం లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు పెంచాలని.. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ భద్రునాయక్, ఏపీఓ జ్యోతి ఉన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చాలని ఆందోళన



నిరసన వ్యక్తంచేస్తున్న కాలనీవాసులు

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో కొన్ని రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ పథకం నల్లాల ద్వారా తక్కువ నీరు వస్తుండటంతో స్థానికులు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. విషయాన్ని సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సోమవారం ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నల్లాల ద్వారా వచ్చే నీరు తాగడానికి కూడా సరిపోవడం లేదన్నారు. ఇక ఇతర అవసరాలకు నీరు లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. పంచాయతీ అధికారులు కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని వాపోయారు. ఊరంతా నీటి సరఫరా బాగానే ఉన్నా.. తమ కాలనీలో మాత్రం సమస్య వస్తే పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు.

'దేశవ్యాప్త సమ్మెతో కేంద్రానికి బుద్ధి చెబుదాం'



మాట్లాడుతున్న ఎస్‌ఎం ఖలీల్

మహబూబ్‌న గర్ న్యూటౌన్/హన్వాడ: దేశవ్యాప్త సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్ పిలుపునిచ్చారు. సోమవారం టీఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చేసిందన్నారు. కార్మికుల కష్టాలు, కన్నీళ్లకు బీజేపీ ప్రభుత్వమే కారణమన్నారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని ప్రాధాన్యత కోసం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, వివిధ సంఘాల నాయకులు విజయకుమార్, ఫారుఖ్ హుస్సేన్, మహ్మద్ ఆయుబ్, వెంకటేశ్, తమ్మన్న, రవీందర్‌గౌడ్, ప్రభాకర్, శ్రీదేవి పాల్గొన్నారు.

■ హన్వాడలో రైతు కూలీల సమ్మె పోస్టర్‌ను రైతు సంఘాల నాయకులు ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, కేవీపీఎస్ కార్యదర్శి కుర్మయ్య, మండల అధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్‌లు ర్యాకమయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మోనప్ప గుట్ట ప్రాంతంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు తాటి గణేష్‌కుమార్, సి.గోవిందు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సూర్యచందర్, చిన్నా, శ్రీహరి, శేఖర్, పాండు, బాసిత్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి కృషి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని అధ్యక్షుడు నరేంద్రాచారి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నిధులతో ప్రెస్‌క్లబ్ వద్ద బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభించారు. ప్రెస్‌క్లబ్ వద్ద నీటి సమస్య పరిష్కారం కోసం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, కోశాధికారి యాదయ్య, జాయింట్ సెక్రెటరీ సతీశ్‌కుమార్, ఈసీ సభ్యులు మోహన్ దాస్, రాంకొండ, షాబుద్దీన్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళకు ఆశ్రయం



పాలమూరు: అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న గుర్తుతెలియని మహిళను సఖి కేంద్రం సిబ్బంది చేరదీసి ఆశ్రయం కల్పించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట ప్రాంతంలో సోమవారం గుర్తుతెలియని మహిళ ఎండకు రోడ్డు పక్కన ఉండటం చూసిన సఖి కేంద్రం సిబ్బంది.. టూటౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది సహాయంతో సఖి కేంద్రానికి తరలించారు. సదరు మహిళకు సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే సఖి కేంద్రంలో సంప్రదించాలని కోఆర్డినేటర్ సౌజన్య తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. బస్వాపూర్ సమీపంలోని క్రషర్ వద్ద బ్లాస్టింగ్ చేస్తుండటంతో రాళ్లన్నీ పొలాల్లో పడుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా గుడిబండకు చెందిన ఓ రైతు భూ సమస్యను పరిష్కరించాలని అర్జీ పెట్టుకున్నారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం తదితరులు పాల్గొన్నారు.